21

మినీ కథ

# వాల్మీకి భార్య

'ఆడవాళ్ళకే అన్ని కష్టాలూ అన్నట్లు అందరి సానుభూతీ వాళ్ళ పట్లనే' అన్నాడు మారుతి విసుక్కుంటూ, ధుమ ధుమ లాడుతూ.

తెల్లబోవటం నావంతైంది. తుమ్మల్లో పొద్దు అంటారు అదుగో అలావుంది అతడి ముఖం. ఎర్రగా కందిపోయి. ఇతణ్ణెందుకు పలకరించాంరా బాబూ అనుకున్నట్లు! ఎప్పుడైనా చూశారో లేదో తుమ్మ చెట్ల గుంపుల్లోంచి అస్తమిస్తున్న సూర్య బింబాన్ని. ఈ మధ్య పదిహేను రోజులుగా అసలు కనిపించలేదు. కనిపిస్తేనూ తప్పుకొనిపోయే తప్పునేనే మీ చేయ చేయలేదు. పై పెచ్చు నేను కనిపిస్తే ముఖం చాటు చేసుకోకూడదు. చాటంత చేసుకోవాలి మారుతి న్యాయంగా. దోసిలనిండా చిరు నవ్వులు నింపి పక్కలకి పొర్లిపోతుండగా, ఒకటో రెండో ఇంకా పెదవులకి అతుక్కొని వుండగా, నాకు దండం పెడుతూ సంతోషపడిపోవాలి. అదేం లేకపోగా రెక్క పుచ్చుకొని నేనే కాస్తఆగవోయ్య్. ఈ మధ్య కనిపించి చాలారోజులైంది అనాల్సి వచ్చింది. పాత బట్టకి ఎంత మంచి రంగు అద్దించినా, కళ కళ లాడనట్లుగావుంది అతడి ముఖం. నేనలాగా అతణ్ణి అడిన్న పొదల్లో కలుసు కొని పలకరించడం ఇష్టం లేదులావుంది.

నాపట్ల మారుతి ఎందుకు కృతజ్ఞుడై వుండాలంటారా?!

అదేం పెద్ద కథకాదు. అతడికి రత్నమాల నిచ్చి వాళ్ళ వాళ్ళు పెళ్ళి చేయడానికి నేనేనండీ కారణం! అదా నేచేసిన తప్పు!! ఆఫీసు నుంచి అటే నడుస్తాను ఇంటికి. కాబట్టి కాసేపు ఆ చల్లని చెట్లు చూస్తూ, పువ్వులు చూస్తూ, ఆ పార్కులో ఆడుకొనే చిన్ని చిన్ని, బుజ్జి బుజ్జి పిల్లల్ని చూస్తూ, పావుగంటో అరగంటో గడిపి ఇక లేస్తాను. కార్తీకం వచ్చేసింది. అన్ని అందాలు అమరి, అలంకారాలన్నీ పూర్తిఅయిపోయిన పెళ్లి కూతురులా వుంది ఒక పున్నాగ. ఈ యేడే పూలు పూసిందేమో. ఇద్దరు ముగ్గురు చిన్నారులు పూలేరుతూ నవ్వుకుంటున్నారు. ఆకాశంలో హరివిల్లు తమ కోసమే అనుకొని ఆనందించే అమాయకులు. సృష్టిలో కల్లా అందమైన వస్తువులు.

ఏమిటి నీ బాధ అన్నాను నేనుకూడా కొంచెం గాంభీర్యం ప్రదర్శిస్తూ మారుతిని ఒక చోట కూలేసి.

— వసంజా శ్రీ

'అవునండీ మగవాడికేమీ చికాకులూ చీదరలూ, కష్టాలూ, నిష్ఠూరాలూ ఉండవా? ఉక్రోషులుంటాయి. అసూయపడే వాళ్ళు ఉంటారు. ఏ విధంగానైనా మనస్సు నొప్పిస్తే, కష్టపెడితే, అవతల వాణ్ణి బాధిస్తే, అసూయనంతా ప్రదర్శించుకుంటే, తమ జన్మ సార్థకమైపోయినట్లుగా ప్రవర్తించే మనుషు లుంటారు. వీళ్ళతోనే బతకాలి కదా! 'ఇదంతా ఏమిటి? విసుగు పుట్టించి బోర్ చేసే రచయిత లాగా' అన్నాను మధ్యలో కల్పించుకుంటూ.

'వినండి మరి. అధికారికి ఆపేక్షా, దయ్యానికి దయా ఉండకూడదని ఒక చైనా సామెత. ఆఫీసుల్లో ఏ కష్టాలూ వుండవనుకుంటారు ఈ ఆడవాళ్ళు', వాళ్ళకుండవేమో-అని నా బదులుతానే నాలిక కరుచుకున్నాడు. మారుతి మంచి వాడు. పెద్దమాటలు మాట్లాడడు.

'అదికాదండీ. నామనస్సంతా వికలమై, చికాకనిపించి మొన్నో రోజున నేరుగా సినిమాకి వెళ్ళాను. అదంత కన్నా తలనొప్పి అని తెలుసుకోలేక, మీరు నాకు కట్టబెట్టిన మెళ్ళో గుదిబండ మూడురోజులు సాధిస్తుందేమండీ! ఒక రోజున సిగరేట్ కాల్చానని తెలుసుకుందిట. అదో గొప్ప అపరాధం. నాతి చరామి భంగమై పోయినట్లు. నాకుచాలా అసహ్యమేసింది ఎందుకలా వున్నారు మినిటైంది అని నెమ్మదిగా అడగవచ్చు కదా. అదీ మీ మాట విన్నందుకు నా కొరిగిన సుఖం, హాయి; అని నన్నే ఆ రత్నమాలను చూస్తున్నట్లు చూశాడు. (కొరుక్కుతినడుకదా - కోపంతో!) రత్నమాల మంచి పిల్ల. తెలివైంది. మరి ఎందుకిలా మగడనే పదార్థాన్ని అర్థం చేసుకోకుండా బాధిస్తున్నది! మగువ మనసు ప్రశ్నార్థకం!

'ఇది నీ మంచికే నయ్యా మారుతీ. మహా పురుషులందరికీ ఇల్లాళ్ళ వల్లనే జ్ఞానోదయమైంది. కిరాతుడు మహర్షి కావడానికీ, సోక్రటీస్ తత్త్వవేత్తగా మారడానికీ, తులసీదాసు రామాయణం రాయడానికీ కారణం, లేదా ప్రేరణం ఎవరో తెలిస్తే నీవింత బాధపడవు' అన్నాను.

అతడి కర్థమైందో కాలేదో - ఎవరికి అర్థమైనా కాకపోయినా నేనేమీ చెయ్య లేను. ఎదురుగా చిన్నిచిన్ని చిన్నారులు. పున్నాగ పూలకాడ లూదుతూ. పూల రెక్కల బుడగలు బుగ్గల మీద టప్ మనిపించుకుంటూ.*

టుప్ టీక :- అదండీ కథ. మహర్షి కాకపూర్వం 'నీ పాపంతో నాకు పనిలేదు. నీవు దోచితెచ్చే సొమ్ముమాత్రమే నాక్కావాలి'. అందిట వాల్మీకిగారితో ఆయన ఇల్లాలు. అర్థం చేసుకోవడం అనే పెద్ద పెద్ద కబుర్లు వన్ వే ట్రాఫిక్ కాకూడదు. వర్తమాన సమాన సమాజంలో ఎన్నో ఉద్రిక్తతలు. ఇవి ఆలూ మగడూ ఇద్దరికీ అర్థం కావాలి- అంటారు మంజుశ్రీ.